వరద మునేరు.. తలుచుకుంటే బేజారు

మునేరు వరద బీభత్సానికి ఏడాది

- గత ఆగష్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో దంచిన వానలు
- కొట్టుకు పోయిన లింగాల కాజ్‌వే చప్టా
- నిరాశ్రయులైన వందలమంది
- భారీగా పంట నష్టం



అమ్మవారి ఆలయం వద్ద వరద నీటిలో దుకాణాలు (ఫైల్)



దెబ్బతిన్న పెనుగంచిప్రోలు-వేమవరం రోడ్డు (ఫైల్)

పెనుగంచిప్రోలు: గత ఏడాది సరిగ్గా సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వచ్చిన భారీ వర్షాలకు మునేరు పెను విధ్వంసం సృష్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి మునేరుకు మూడు లక్షల క్యూసెక్కుల వరద రావటంతో వత్సవాయి మండలం వేమవరం వద్ద మునేరు తువ్వకాలువకు మైసమ్మ గండి వద్ద మూడు పెద్ద గండ్లతోపాటు మొత్తం 50 చోట్ల వరకు గండ్లు పడ్డాయి.

కొట్టుకుపోయిన పంటలు.. పొలాల్లో ఇసుక మేటలు

దీంతో ఆయకట్టున ఉన్న పంట పొలాలు, మామిడి తోటలు వరద నీటికి కొట్టుకు పోయి ఇసుక మేటతో పాటు భూములు భారీగా కోతలకు గురయ్యాయి. ఆగండ్లు నేటి వరకు పూడ్చక పోవటంతో రైతులు మూడు పంటలు కోల్పోయారు. పొలాలు బాగు చేసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందక పోవటంతో కొందరు పొలాలను అలానే బీడుగా ఉంచేశారు. కొందరు రైతులు సొంతగా ఖర్చు పెట్టుకుని బాగు చేయించుకున్నారు.

పూర్తిగా దెబ్బతిన్న లింగాల కాజ్‌వే..

వరద ఉధృతికి మునేరుపై లింగాల వద్ద కాజ్‌వే నామ రూపాలు లేకుండా పోయింది. చప్టా మొత్తం వరదకు కొట్టుకు పోయింది. ఇటీవలనే సుమారు రూ.2 కోట్లతో కాజ్‌వే పునరుద్ధరించారు. అలాగే పెనుగంచిప్రోలు- వేవవరం, పెనుగంచిప్రోలు- ముచ్చింతాల, పెనుగంచిప్రోలు- అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు రోడ్లు కూడా పూర్తిగా తారు కొట్టుకు పోయి మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి.

ఆలయ పరిసరాలు నీటమునిగి..

పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద, సరిసరాలు నీటమునిగి నిరాశ్రయులైన వారికి ఆలయ సత్రాల్లో పునరావాసం కల్పించారు. వరదకు ఇళ్లల్లోకి నీళ్లు వెళ్లి పలు ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు ధాన్యం, ఇతర వస్తువులు తడిసి సోయాయి. శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద దుకాణాల్లోని సరుకు, బొమ్మలు, ఇతర వస్తువులు వరదలో కొట్టుకు పోవటంతో రూ.లక్షల్లో నష్టపోయారు. అలాగే మునేరు అవతల ఫంక్షన్‌హాల్స్‌ను కూడా వరద ముంచెత్తటంతో దారుణంగా నష్టపోయారు. నాటి దృశ్యాలను బాధితులు నేడు తలుచుకుంటున్నారు.

పాలేటి వరదకు..

జగ్గయ్యపేట: గతేడాది మండలంలోని పాలేటికి వచ్చిన వరదలకు నేటితో ఏడాది పూర్తయింది. ఎన్నడూ లేని విధంగా పాలేరు ఉధృతంగా ప్రవహించటంతో ఏపీ, తెలంగాణ సరిహద్దులోని బ్రిడ్జి 10 అడుగుల మేర కోతకు గురైంది. అనుమంచిపల్లి, అన్నవరం, బూదవాడ, అగ్రహారం గ్రామాలలో వరద పోటెత్తటంతో నాలుగు రోజుల పాటు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అన్నవరం బ్రిడ్జి 10 అడుగుల మేర కొట్టుకుపోయింది. వందల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. బూదవాడ, రెడ్డినాయక్ తండా రహదారులు ధ్వంసం అయ్యాయి. పాలేటి ఉప నది పక్కనున్న ఇళ్లు దెబ్బతిన్నాయి. పట్టణంలోని పాలేరు బ్రిడ్జి కూడా కొట్టుకుపోయింది. మఠం శివాలయంలో ఇళ్లన్నీ మునిగాయి. నేటికీ బాధితులను ఆదుకోలేదని, పరిహారం అందలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జగ్గయ్యపేట పట్టణం మఠం శివాలయం ప్రాంతంలో జలదిగ్బంధంలో గృహాలు (ఫైల్)



కొట్టుకుపోయిన పాలేటి బ్రిడ్జి (ఫైల్)

క్లుప్తంగా

ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



వత్సవాయి: మునేటికి ఎగువ జిల్లాలైన తెలంగాణలోని వరంగల్, ఖమ్మం జిల్లాలలో భారీ వర్షాలు పడుతుండడంతో మునేటికి భారీ స్థాయిలో వరదనీరు వచ్చిచేరుతోంది. తెలంగాణ నుంచి మునేటికి 9.5 అడుగుల మేర 21 వేల క్యూసెక్కుల వరదవస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పైనుంచి వస్తున్న వరదనీటిని దృష్టిలో ఉంచుకుని మునేటిపై లింగాల వద్ద ఉన్న కాజ్‌వేపై ఇరు పక్కల బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. మునేటికి 15 అడుగుల మేర వరదవస్తే లింగాల కాజ్‌వేపై నుంచి వరదనీరు పారే అవకాశం ఉందని చెప్పారు. రాత్రికి మునేటికి వరదపెరిగితే కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేయనున్నట్లు చెప్పారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



పెనుగంచిప్రోలు: ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలని ఏఓ కె. రామసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రికార్డులు పరిశీలించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఎమ్మార్పీ ధరలకు విక్రయించకపోతే రైతులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

పెనుగంచిప్రోలు: గ్రామంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్ సోమవారం అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో ముందస్తుగా కాలువలు శుభ్రం చేయటంతో పాటు వీధులు మొత్తం శుభ్రం చేయిస్తున్నామన్నారు. దోమల నివారణ మందు కూడా స్ప్రే చేస్తున్నామన్నారు.

కాలేజీ బస్సు.. కారు ఢీ

నందిగామ రూరల్: మండలంలోని ఐతవరం గ్రామ శివారు కంచల వెళ్లే రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కళాశాల బస్సు కారు ఢీకొన్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు పట్టణంలోని చైతన్య కళాశాల బస్సు కళాశాల నుంచి విద్యార్థులను వారి గ్రామాలలో దించేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో విజయవాడ వైపు నుంచి వస్తున్న కారు బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాక పోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. దీంతో జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతి

పాల్గొననున్న మొండితోక, తన్నీరు



మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ రూరల్: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వీరులపాడు మండలం పెద్దాపురం, అల్లూరు గ్రామాలలో కంచికచర్ల మండలం గొట్టుముక్కల, కంచికచర్ల, నందిగామ మండలం అంబారుపేట, నందిగామ పట్టణంలో జరిగే వర్ధంతి కార్యక్రమాలలో శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పాల్గొంటారని తెలిపారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు, పోపూరు, చందర్లపాడు, బబ్బెళ్లపాడు, నందిగామ, కంచికచర్ల మండలం పరిటాల, గనిఆత్కూరు, కొత్తపేట గ్రామాలలో జగన్‌మోహనరావు పాల్గొంటున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాలలోని వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ కూడళ్లలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందని, ముఖ్యఅతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9.30 కు పార్టీ నియోజకవర్గ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరనున్నట్లు తెలిపారు. పట్టణంలోని విలియంపేట, బలుసుపాడు రోడ్, క్రిస్టియన్‌పేట, కోదాడ రోడ్, బస్టాండ్ సెంటర్, బైపాస్ రోడ్‌లోని వైఎస్సార్ సర్కిల్, ధనంబోడు, తొర్రగుంటపాలెం -1, తొర్రగుంటపాలెం, బొడ్రాయి సెంటర్- 2, కాకానినగర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద వర్ధంతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వర్క్ ఆర్డర్లు అందజేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించి పిలిచిన టెండర్లకు గాను వర్క్ ఆర్డర్లను అందజేశారు. ఇటీవల ఏపీసీఆర్‌డీపీ నిధుల నుంచి కేటాయించబడిన పనులకు టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర చేతుల మీదుగా అందజేశారు. వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలోని మినీ బైపాస్ రోడ్‌లో (బుద్ధవిహార్ ఎదురు రోడ్డు) సోలార్ లైట్లు ఏర్పాటు చేయబోతున్నామని, పైలెట్ ప్రాజెక్ట్‌గా 10వ వార్డును తీసుకొని సోలార్ లైట్ల ఏర్పాటు కార్యక్రమం మంగళవారం నుంచి మున్సిపల్ సిబ్బంది అమలుచేస్తారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ టీవీ.కృష్ణారావు, మున్సిపల్ సిబ్బంది, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు హేయం



నందిగామలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



పేటలో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నందిగామ టౌన్: న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించటం హేయమని బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ షేక్ ఆజాద్ పేర్కొన్నారు. న్యాయవాదులు పి.కరిముల్లా, నిర్మల్‌బాబులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయటాన్ని ఖండిస్తూ స్థానిక 16వ అదనపు జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ న్యాయ అన్యాయాలను విస్మరించిన న్యాయవాదులపై అక్రమ కేసులు మోపుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు స్టాలిన్, రామారావు, సాంబశివరావు, నంద్రు శ్రీరామ్మూర్తి, మహ్మద్ అమీన్, షేక్ సైదా, దేవదాస్, నూతన్, షేక్ దాదా సాహెబ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: నందిగామ బార్ అసోసియేషన్ న్యాయవాదులు పి.కరీముల్లా, ఏ.నిర్మల్‌బాబుపై పోలీసులు అక్రమ చర్యలను నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తక్షణ అమలుకు విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నాగేశ్వరరావు, గోనెల వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసగౌడ్, ఎం.ఆంజనేయులు, బి.శ్రీధర్, ఎం.మనోహర్, గురువులు రాజు, అశోక్, ఎం.నరేష్, పల్లపు రవి, బిక్షమయ్య, అమ్ములు పాల్గొన్నారు.

పత్తి పంటకు నష్టం చేస్తున్న వాన



పెనుగంచిప్రోలు వద్ద పత్తి పంటలో వర్షపు నీరు

పెనుగంచిప్రోలు: వర్షం వదలక పోవటంతో పొలాల్లో తేమ ఆరటం లేదు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షంతోపాటు సోమవారం ఉదయం కురిసిన వర్షంతో పొలాల్లో మరలా నీరు చేంది. దీంతో ముఖ్యంగా పత్తి పొలాలు దారుణంగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు ఎర్రబడటంతో పాటు పూత, పిందె రాలిపోతున్నాయని అంటున్నారు. మిర్చి మొక్క ఇప్పుడే వేస్తున్నారని, నీరు నిల్వ ఉంటే వేళ్లు కుళ్లి మొక్కలు ఎండుతాయంటున్నారు. అసలు ఆగష్టు మొదటి వారం తరువాత పడుతున్న వర్షాలతో చేలల్లో నుంచి నీరు ఉబికి వస్తోందని, ఈఏడాది నష్టాలు తప్పవని వాపోతున్నారు. మరో పక్క ఎగువున వరంగల్, ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో మునేరుకు వరద నీరు వచ్చి చేరుతోంది. సోమవారం సాయంత్రానికి పోలంపల్లి డ్యాం వద్ద మునేరు 10 అడుగుల పైన ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరద పెరుగుతోందని రైతులు భయపడుతున్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకే ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళకే కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం ఎంఈఎఫ్ మాజీ నాయకులు బోయ నాగభూషణం గృహంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాతంగి దావీదు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు కోట దానియేలు, జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రాజ్యాంగబద్ధంగా జగ్గయ్యపేట మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించగా, కొందరు రాజకీయ నాయకులు రాజ్యాంగానికి విరుద్ధంగా రిజర్వేషన్‌ను జనరల్ చేయడానికి ప్రయత్నిస్తున్న తీరును చూస్తుంటే రాజ్యాంగాన్ని కాపాడాల్సిన నాయకులే రాజ్యాంగాన్ని కాలరాస్తూ దళితుల హక్కులను, మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జగ్గయ్యపేట మండల అధ్యక్షుడు చింతిరాల గోపి, ఉపాధ్యక్షుడు అమ్మనబోయిన రారాజు, వత్సవాయి మండల ఎంఎస్‌పీ అధ్యక్షుడు మాగి శ్రీనివాస్, వత్సవాయి మండల ఇన్‌చార్జ్ తోళ్ల రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అన్నెపాగ కాంతారావు, న్యాయవాది ఆలేటి కిషోర్, ఎమ్మార్పీఎస్ నాయకులు వేమవరపు స్వామి, మాతంగి కిషోర్, కోట ప్రభూజి, రాజశేఖర్, బోయ రంజిత్, యంగ్రాతి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ వారిని సోమవారం రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతమ్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. మండల విశ్వబ్రాహ్మణ సంఘం తరుపున ఆమెను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సంఘ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి టి. రంగబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు డి.శోభన్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డీవీఎల్ నరసింహాచారి, రాష్ట్ర మహిళా నాయకురాలు కల్లూరి శ్రీవాణి, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చల్లాల శివాజీ, మండల నాయకులు నంచర్ల గోపాలచారి, వెలిశాల ఏడుకొండలు, తునికిపాటి రాంబాబు, నంచర్ల వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

జగ్గయ్యపేట: విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణులంతా కలిసి కట్టుగా ఉండాలన్నారు. అనంతరం మహిళలు ఆమెను ఘనంగా సత్కరించారు. విశ్వ బ్రాహ్మన సంఘ ప్రతినిధులు కొత్తపల్లి సత్యనారాయణ, ధనాలకోట శోభన్‌బాబు, లింగాచారి, మామిడిపల్లి రామకృష్ణ, గోపాలరావు, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌లతో సామాజిక భద్రతకు భరోసా

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ పింఛన్‌లతో పేదల సామాజిక భద్రతకు భరోసా లభిస్తుందని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గ్రామంలో ప్రారంభమైన పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారులకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలో 2,30,277 పింఛన్‌లకు గాను దాదాపు రూ. 99.55 కోట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సిబ్బందితో ఇంటి వద్దనే పింఛన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా ప్రతినెలా పింఛన్‌ల పంపిణీ చేస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పంపిణీలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని మూడు కుటుంబాల లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

కొళ్లికూళ్ల(పెనుగంచిప్రోలు): మండలంలోని కొళ్లికూళ్ల గ్రామంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శనగపాడు గ్రామం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ఈకార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, వలంటీర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యనమల నాగార్జున యాదవ్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

320 మందికి వైద్య పరీక్షలు

నందిగామ రూరల్: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దాములూరు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమరావతి కంటి ఆస్పత్రి, బెస్ట్ హాస్పిటల్, పనమాలజీ హాస్పిటల్ వైద్యులు 320 మంది రోగులను పరీక్షించారు. వారిలో 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 63 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు చెప్పారు. 63 మందికి ఉచితంగా కళ్లజోళ్లను, అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జోష్టి సంధ్య, సురేష్, అనూష, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నే కళావతి, గాదెల వీరబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి


కెఅగ్రహారం(జగ్గయ్యపేట): పాముకాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన మంజుల రమణయ్య (37)వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో సాయంత్రం సమయంలో గ్రామ సమీపంలోని పంట పొలంలో పశువుల మేతకు గడ్డి కోసి మోపు కదుతుండగా పాము కాటుకు గురయ్యాడు. దీంతో రమణయ్య కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు వచ్చి హుటాహుటిన జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ చెప్పారు.

నేడు కంటి వైద్యశిబిరం


జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ధరణికోట వారి పెన్షనర్స్ భవన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దారా వినోద్‌బాబు, డి.మరియదాసుసోమవారంతెలిపారు. మ్యాక్స్ విజన్ ఐ ఇంటర్నేషనల్ హాస్పిటల్ వారు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేసి మందులు అందజేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులు వినియోగం చేసుకోవాలని కోరారు.




అంబారుపేటలో గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



తొర్రగుంటపాలెంలో మారుతీయూత్ ఆధ్వర్యంలో..



పంచాయతీ కార్యాలయం సమీపంలో గణనాథుడు



పెనుగంచిప్రోలు శివాలయం వద్ద ఊరేగింపులో మహిళలు

జైజై గణేశా.. బైబై గణేశా!

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో వినాయక చవితి పండుగకు ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు నిమజ్జనానికి తరలుతున్నాయి. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, యువకుల కోలాహలం మధ్య నిమజ్జ నోత్సవాలు నిర్వహిస్తున్నారు. నందిగామ మండలంలోని అంబారుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథునికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. రెండు నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. - నందిగామ రూరల్/జగ్గయ్యపేట అర్బన్/జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు


మరువలేము మిమ్ములను
మహానేత
ప్రజా సంక్షేమమే ఊపిరిగా...
ప్రజల గుండెల్లో ఆరాధ్య దైవంగా నిలిచి
కల్మషం ఎరుగని మీ చిరునవ్వు..
రాజసం ఉట్టిపడే మీ వ్యక్తిత్వం...
తెలుగు ప్రజలకు ఎప్పటికీ ఓ అపురూపమే
మీ వర్ధంతి వేళ మీకిదే
మా.... నివాళి
డా॥ మొండితోక జగన్‌మోహనరావు
మాజీ శాసనసభ్యులు-నందిగామ
డా॥ మొండితోక అరుణకుమార్
MLC